క్లుప్తంగా

ఆపరేషన్ థియేటర్ ప్రారంభం



జంతువుల ఆపరేషన్ థియేటర్‌ను ప్రారంభిస్తున్న పశు సంవర్ధక శాఖ అధికారి వెంకట్రావు తదితరులు

అమలాపురం టౌన్: స్థానిక ఎన్టీఆర్ మార్గ్‌లోని ప్రాంతీయ పశు వైద్యశాల వద్ద దాతల సహకారంతో నిర్మించిన చిన్న మూగ జంతువుల ఆపరేషన్ థియేటర్‌ను జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి కె.వెంకట్రావు, ఉప సంచాలకుడు మూర్తి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వెంకట్రావు మాట్లాడుతూ దాతలు దాదాపు రూ.60 వేలు సమకూర్చి చిన్న మూగ జంతువుల కోసం శస్త్రచికిత్స హాలును ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. దీనివల్ల కుక్కలు, గొర్రెలు, మేకలకు ఏదైనా జబ్బులు చేస్తే సునాయాసంగా శస్త్రచికిత్సలు చేసేందుకు వెసులుబాటు ఉంటుందన్నారు. దాతలు రామాయణం సురేష్, గ్రంధి సతీష్, గుప్తా, జయంతి లాల్‌జాన్‌లను పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు ఎల్.విజయరెడ్డి అభినందించారు. పశు వైద్యాధికారులు మేడిద నారాయణమూర్తి, పూర్ణిమ, కావ్య, మాధురి, సిబ్బంది పాల్గొన్నారు.

సాయిశ్రీకి సాయిబాబా మెడల్ ప్రదానం



సాయిశ్రీకి సత్య సాయిబాబా మెడల్‌తోపాటు పలు బహుమతులు అందజేస్తున్న డాక్టర్ ప్రభాకర్ తదితరులు

అమలాపురం టౌన్: స్థానిక కొంకాపల్లి జవహర్‌లాల్ నెహ్రూ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదివి పరీక్షల్లో 600 మార్కులకు 563 మార్కులు సాధించిన గుత్తల సాయిశ్రీకి సత్య సాయిబాబా మెడల్‌ను ప్రదానం చేశారు. పాఠశాలలో శుక్రవారం జరిగిన స్వాతంత్ర్య దిన వేడుకల వేదికపై సాయిశ్రీకి అమలాపురం డివిజన్ సత్యసాయి సేవా సమితి కో ఆర్డినేటర్ డాక్టర్ జి.ప్రభాకర్ మెడల్ అందించారు. అలాగే విద్యార్థినికి గోడ గడియారం, సత్యసాయిబాబా చిత్రపటం, పెన్ను బహూకరించి సత్కరించారు. 35 ఏళ్లుగా సత్యసాయి సేవా సమితి పదో తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు మెడల్స్ ప్రదానం చేస్తుందని డాక్టర్ ప్రభాకర్ తెలిపారు. వార్డు కౌన్సిలర్ తిక్కా సత్యలక్ష్మి, పాఠశాల హెచ్‌ఎం మోరం సీతామహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆలయ ప్రతిష్ఠ మహోత్సవాలు ప్రారంభం



సీతారామపురంలో శ్రీవిజయ కనకదుర్గాదేవి ఆలయం వద్ద పూజల్లో భక్తులు

తాళ్లరేవు: కోరంగి పంచాయతీ సీతారామపురం గ్రామం కోలాటివారి రేవులో కొత్తగా నిర్మించిన శ్రీవిజయ కనకదుర్గాదేవి ఆలయ ప్రతిష్ఠ మహోత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. గ్రామ పురోహితుడు కందికొండ భాస్కరశర్మ, గ్రామస్తుల ఆధ్వర్యంలో పుణ్య దంపతులచే ఉదయం 7.30 గంటలకు సంకల్పం, విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవాచనం, దీక్షాధారణ, యాగశాల ప్రవేశం, అఖండ దీపారాధన తదితర కార్యక్రమాలను నిర్వహించారు. భాస్కరశర్మ మాట్లాడుతూ ఈ నెల 17వ తేదీ ఉదయం 7.16 గంటలకు అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ ఉంటుందన్నారు. అనంతరం అన్న సమారాధన జరుగుతుందని, అధిక సంఖ్యలో భక్తులు తరలిరావాలని కోరారు.

రామాలయం పేటలో..



జి.వేమవరంలో లక్ష్మీగణపతి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాల్లో పాల్గొన్న దంపతులు

తాళ్లరేవు: జి.వేమవరం రామాలయం పేట గ్రామంలో కొత్తగా నిర్మించిన శ్రీలక్ష్మీగణపతి పరివార దేవతా విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. వేద పండితుడు సత్యనారాయణ శర్మ నేతృత్వంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సర్పంచ్ పుణ్యమంతుల సూరిబాబు, విగ్రహ దాతలు యర్రంనీడి కృష్ణమూర్తి, లక్ష్మీ, పుణ్యమంతుల సత్తిబాబు, దుర్గాదేవి తదితరులచే విశేష పూజలు చేశారు. సర్పంచ్ సూరిబాబు మాట్లాడుతూ 17న ఉదయం 7.17 గంటలకు శ్రీలక్ష్మీ గణపతి, అభయ ఆంజనేయస్వామి, నాగబంధన యంత్ర, బింబ ప్రతిష్ఠ చేసిన అనంతరం అన్నసమారాధన ఉంటుందన్నారు.

ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభం

ముమ్మిడివరం: స్థానిక విష్ణాలయం సెంటర్‌లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు ప్రారంభించారు. మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద, చెల్లి అశోక్, గుత్తుల సాయి, ఓగోరి భాగ్యశ్రీ, గొల్లకోటి దొరబాబు పాల్గొన్నారు.



కాట్రేనికోన మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీపీ కోలాటి సత్యవతి ఆధ్వర్యంలో వేడుకలు



తాళ్లరేవులో జాతీయ జెండాకు వందనం చేస్తున్న తహసీల్దార్ త్రినాథరావు తదితరులు



ముమ్మిడివరం నగర పంచాయతీ వద్ద చైర్మన్ ప్రవీణ్‌కుమార్, కమిషనర్ రవివర్మ ఆధ్వర్యంలో..



వాడపర్రు ఎంపీపీ పాఠశాలలో విద్యార్థులకు బ్యాగులను అందజేస్తున్న ప్రతినిధులు



యానాంలో పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరిస్తున్న మంత్రి లక్ష్మీనారాయణ

జెండా మురవంగ.. ఊరూవాడా పండగ

- ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవం
- వాడవాడలా సంబరాలు

అమలాపురం టౌన్/ తాళ్లరేవు/ కాట్రేనికోన/ ముమ్మిడివరం/ ఉప్పలగుప్తం/ అల్లవరం/ యానాం/ అమలాపురం రూరల్: : మువ్వన్నెల జెండా మురిసింది.. ఊరూవాడా సంబరం తెచ్చింది.. స్వేచ్ఛా వాయువులు పీల్చుతూ భారత దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన రోజు కావడంతో అందరిలో దేశభక్తి ఉప్పొంగింది.. స్వాతంత్ర్య దినోత్సవాన్ని అమలాపురం, ముమ్మిడివరం నియోజకవర్గాల్లో ఘనంగా నిర్వహించారు. అమలాపురం పట్టణంలో స్వాతంత్ర్య దిన వేడుకలు దేశభక్తిని చాటేలా సాగాయి. ఇక్కడి ఎన్టీఆర్ మార్గ్‌లోని జిల్లా ఎస్పీ బంగ్లా ప్రాంగణంలో ఎస్పీ బి.కృష్ణారావు జాతీయ జెండాను ఆవిష్కరించారు. మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో భరతమాత విగ్రహం వద్ద మున్సిపల్ చైర్ పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి జాతీయ జెండాను ఎగురవేశారు. ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు, మున్సిపల్ కమిషనర్ వి.నిర్మల్ కుమార్, మున్సిపల్ కౌన్సిలర్లు, వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర, పట్టణ పార్టీ అధ్యక్షుడు సంసాని బులినాని తదితరులు పాల్గొన్నారు. స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణ రావు తదితరులు పాల్గొన్నారు. అమలాపురం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (అముడా) కార్యాలయం ప్రాంగణంలో అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు జెండాను ఆవిష్కరించారు. డీఎస్పీ కార్యాలయం వద్ద డీఎస్పీ టీఎస్ఆర్‌కే ప్రసాద్, పట్టణ పోలీస్ స్టేషన్ ఆవరణలో సీఐ పి.వీరబాబు, 13వ వార్డులోని మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ మున్సిపల్ ఉర్దూ పాఠశాల వద్ద వార్డు కౌన్సిలర్ సంసాని బులినాని జెండాను ఆవిష్కరించారు. వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు షేక్ అబ్దుల్ ఖాదర్, పాల్గొన్నారు. గడియార స్తంభం సెంటర్‌లోని మహాత్మా గాంధీ విగ్రహం వద్ద పట్టణ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బోణం సత్య వరప్రసాద్, ఆఫీసర్స్ రిక్రియేషన్ క్లబ్ ప్రాంగణంలో జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు అల్లాడ శరత్‌బాబు, ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి వద్ద గణేష్ వర్తక సంఘం ఆధ్వర్యంలో జాతీయ జెండాలను ఆవిష్కరించారు. తాళ్లరేవు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ రాయుడు సునీత జాతీయ జెండాను ఎగురవేశారు. అలాగే హైస్కూల్‌లో జెడ్పీటీసీ సభ్యులు దొమ్మేటి సామ్యూల్ సాగర్, తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ పితాని త్రినాథరావు, సుంకరపాలెంలో సర్పంచ్ టేకిపూడి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. దిండిలో మల్లాడి సత్యలింగ నాయకర్ భవనం వద్ద సర్పంచ్ పెయ్యల మంగేష్ జాతీయ జెండాను ఎగురవేశారు.

- కాట్రేనికోన తహసీల్దార్ కార్యాలయం, పోలీస్ స్టేషన్ వద్ద, పల్లంకుర్రు, కాట్రేనికోన సీహెచ్‌సీలు, కాట్రేనికోన సిద్ధార్థ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో జాతీయ జెండాలను ఆవిష్కరించారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీపీ కోలాటి సత్యవతి, కాట్రేనికోన, బలుసుతిప్ప, పల్లంకుర్రు, పల్లం పంచాయతీల వద్ద సర్పంచులు గంటి వెంకట సుధాకర్, మల్లాడి ఏడుకొండలు, నాతి అలివేణి, మల్లాడి వీరబాబ్జీ ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. జెడ్పీటీసీ నేల కిశోర్, కోలాటి సత్యం, నల్లా నరసింహమూర్తి, జగడం బాలయ్య పాల్గొన్నారు.
- ముమ్మిడివరం నగర పంచాయతీ కార్యాలయంలో చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్, కమిషనర్ పి.రవివర్మలు జాతీయ జెండాను ఎగుర వేశారు. జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వడ్డి నాగేశ్వరరావు, ఎయిమ్స్ ఇంజినీరింగ్ కళాశాలలో జిల్లా విద్యాశాఖాధికారి షేక్ సలీం బాషా, జిల్లా వైద్య శాఖాధికారి ఎం.దుర్గారావు దొర జాతీయ జెండాలను ఆవిష్కరించారు. ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ కోలా గంగాభవానీ, తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ టి.సుభాష్, పోలీస్ స్టేషన్ వద్ద ఎస్సై డి.జ్వాలాసాగర్, ఐసీడీఎస్ కార్యాలయం వద్ద సీడీపీఓ నిహారిక ఆధ్వర్యంలో వేడుకలు జరుపుకొన్నారు. లంక తల్లమ్మ గుడి గాంధీ విగ్రహం వద్ద మహిళా కళాశాల విద్యార్థినుల ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి.
- ఉప్పలగుప్తం మండల పరిషత్ కార్యాలయం, పీహెచ్‌సీలలో ఎంపీపీ దంగేటి వీర అచ్యుతజానకి స్వాతంత్ర్య సమరయోధుల చిత్రపటాలకు నివాళులర్పించారు. తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ వీఎస్ దివాకర్, గొల్లవిల్లి పంచాయతీ పరిధి వాడపర్రులో స్పైస్ అండ్ గ్రీన్ స్టార్ ఫెర్టిలైజర్స్ ఆధ్వర్యంలో 50 మంది విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, బ్యాగులను అందజేశారు. జెడ్పీటీసీ సభ్యుడు గెడ్డం సంపదరావు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి దంగేటి రాంబాబు పాల్గొన్నారు.

మహనీయులను స్మరించుకుందాం: కలెక్టర్

స్వాతంత్ర్యం కోసం తమ జీవితాలను త్యాగం చేసిన మహనీయులను స్మరించుకుందామని కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ ప్రజలకు పిలుపునిచ్చారు. కలెక్టరేట్ వద్ద కలెక్టర్‌తో పాటు జేసీ నిషాంతి, డీఆర్ఓ మాధవిలు జాతీయ పతాకాన్ని ఎగుర వేశారు. అమలాపురం ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి జాతీయ జెండాను ఆవిష్కరించారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దార్ అశోక్‌ప్రసాద్, డీఎల్‌పీఓ కార్యాలయం వద్ద డీఎల్‌పీఓ బొజ్జిరాజు జాతీయ జెండాలను ఆవిష్కరించారు. త్రిరత్న బుద్ధ విహార్ ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో బుద్ధ విహార్ చైర్మన్ నాగాబత్తుల ప్రసాదరావు, బుద్ధ విహార్ ప్రధాన కార్యదర్శి డీబీ లోక్ పాల్గొన్నారు. తాండవపల్లి పంచాయతీ వద్ద సర్పంచ్ గంగుమళ్ల యేసుబాబు, పేరూరు పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ దాసరి అరుణడేవిడ్ జెండాను ఆవిష్కరించారు.



అమలాపురం మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో స్వాతంత్ర్య దిన వేడుకల్లో ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ సత్య నాగేంద్రమణి



గోడిలో ఎమ్మెల్సీ క్యాంప్ కార్యాలయంలో జాతీయ జెండాకు వందనం చేస్తున్న ఎమ్మెల్సీ ఇజ్రాయిల్



అమలాపురం ఎస్పీ బంగ్లాపై జాతీయ జెండాకు వందనం చేస్తున్న జిల్లా ఎస్పీ కృష్ణారావు



యానాంలో చిన్నారుల నృత్యప్రదర్శన



కలెక్టరేట్‌లో జాతీయ పతాకానికి వందనం చేస్తున్న కలెక్టర్, జేసీ, డీఆర్వో

మహానుభావుల త్యాగఫలమిది

ఎందరో మహానుభావుల త్యాగఫలంతో దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిందని ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ అన్నారు. గోడిలోని ఎమ్మెల్సీ క్యాంప్ కార్యాలయంలో స్వాతంత్ర్య దిన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ జాతీయ జెండాను ఆవిష్కరించారు. అల్లవరం మండల పరిషత్ కార్యాలయంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ లక్ష్మణరావు ఆధ్వర్యంలో, గోడి పీహెచ్‌సీలో జాతీయ జెండాను ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు ఎగుర వేశారు. వైస్ ఎంపీపీ వడ్డి గంగా, ముత్యాల వెంకట రామకృష్ణ పాల్గొన్నారు.

- యానాం బాలయోగి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో పుదుచ్చేరి పీడబ్ల్యూడీ శాఖ మంత్రి లక్ష్మీనారాయణ జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం బెలూన్లు, శాంతి కపోతాలను ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్, ఆర్ఏఓ మునిస్వామి, ట్రైనీ ఐఏఎస్, మున్సిపల్ కమిషనర్ బుద్ధి అఖిల్, ఎస్పీ చింతా కోదండరామ్ ఎగుర వేశారు. అనంతరం వివిధ పాఠశాలల విద్యార్థినుల ప్రదర్శనలు అలరించాయి.

ఆటో కార్మికుల పొట్టకొట్టొద్దు

అల్లవరం: మహిళలకు బస్సుల్లో ఉచితంగా ప్రయాణం కల్పించి వేలాది మంది ఆటో కార్మికుల పొట్టను కూటమి ప్రభుత్వం కొడుతుందని ఆటో కార్మికుల అసోసియేషన్ అధ్యక్షుడు చేగొండి పెద్దిరాజు అన్నారు. మహిళలకు ఉచిత బస్సు కల్పించడంపై బెండమూర్లంక సెంటర్లో ఆటో కార్మికులు శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఉచిత బస్సు నిర్ణయంతో ఆటో కార్మికులు రోడ్డున పడతారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఆటోలపై జీవనం పొందుతున్న కార్మికుల పొట్టకొట్టవద్దని నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఆటో కార్మికులు కొప్పాడి విజయ, దడాల శేఖర్, కోడి కామేష్, కాండ్రేగుల వెంకటేశ్వరరావు, చొల్లంగి రాము, ఉల్లూరి శ్రీను తదితరులు పాల్గొన్నారు.



బెండమూర్లంక సెంటర్లో నినాదాలు చేస్తున్న ఆటో కార్మికులు

వైభవంగా వరలక్ష్మీ వ్రతాలు

అమలాపురం టౌన్: స్థానిక వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా సామూహిక వరలక్ష్మీ వ్రతాలు వైభవంగా జరిగాయి. సుమారు రెండు వేల మందికి పైగా వ్రతాలు ఆచరించారు. సామూహిక వ్రతాల్లో పాల్గొన్న ప్రతి మహిళకు దేవస్థానం ఒక లక్ష్మీదేవి రూపు, రవికల వస్త్రం, గాజులు, ప్రసాదం తదితర పూజా సామగ్రిని సమకూర్చింది. దేవస్థానం ప్రధాన అర్చకుడు పెద్దింటి లక్ష్మీనరసింహాచార్యులు ఆధ్వర్యంలో అర్చక బృందం ఈ వ్రతాలను నిర్వహించింది. దేవస్థానం ఈఓ యర్రా వెంకటేశ్వరరావు, సిబ్బంది భక్తులకు సేవలు అందించారు.



అమలాపురం వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో వరలక్ష్మీ వత్రాలు ఆచరిస్తున్న మహిళలు

సత్యలింగ నాయకర్ పేరు పెట్టాలి

తాళ్లరేవు: మహాదాత, ఎంఎస్ఎన్ చారిటీస్ నిర్మాణకర్త మల్లాడి సత్యలింగం నాయకర్ పేరును కాకినాడ జిల్లాకు పెట్టాలని పలువురు డిమాండ్ చేశారు. శుక్రవారం కోరంగి పంచాయతీలోని మల్లాడి సత్యలింగ నాయకర్ భవనం వద్ద జరిగిన సమావేశంలో కాకినాడ జిల్లా అగ్నికుల క్షత్రియ సంఘ ఉపాధ్యక్షుడు వాడ్రేవు వీరబాబు, సంఘ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ తిరుమాని కుమారస్వామి, జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు పి.రామలక్ష్మి మాట్లాడుతూ తన యావదాస్తిని విద్యా సంస్థలకు, దేవాలయాలకు ధారాదత్తం చేసిన మహనీయుడు నాయకర్ అని కొనియాడారు. కోరంగి సర్పంచ్ పెయ్యల మంగేష్, ఐక్య మహా సంఘం ఉపాధ్యక్షుడు పెమ్మాడి శ్రీను, సొసైటీ అధ్యక్షుడు కొప్పిశెట్టి బాబి, కొప్పిశెట్టి చంటి పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యతోనే ఉన్నత శిఖరాలు

అల్లవరం: ప్రతి ఒక్కరూ ఉన్నత స్థానాలను అధిరోహించాలంటే నాణ్యమైన విద్య అవసరమని ఐపీఎస్ అధికారి మోకా సత్తిబాబు అన్నారు. ఇటీవల విడుదలైన కానిస్టేబుల్ ఫలితాల్లో ఉద్యోగం సాధించిన కొల్లు జనార్దనరావుకు అభినందన సభ ఓడలరేవులో సర్పంచ్ మల్లాడి మంగాయమ్మ అధ్యక్షతన శుక్రవారం జరిగింది. దీనికి ఐపీఎస్ అధికారి మోకా సత్తిబాబు ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అకుంఠిత దీక్షతోనే ప్రభుత్వ ఉద్యోగాలు సాధించగలమన్నారు. అనంతరం జనార్దనరావును సత్కరించారు. మెరైన్ సీఐ ఎంవీవీఎస్ఎన్ మూర్తి, మల్లాడి ఉమామహేశ్వరరావు, కొల్లు విష్ణుమూర్తి, నాతి లెనిన్ బాబు, పినపోతు ప్రకాష్, తాడి శివ, దాసం పటేల్‌బాబు, దాసరి సత్తిబాబు, ఉండ్రు సత్యనారాయణ, అంజి, సాయి, సిద్ధు తదితరులు పాల్గొన్నారు.



జనార్దనరావును అభినందిస్తున్న ఐపీఎస్ అధికారి మోకా సత్తిబాబు

కల'వరి'పాట్లు

అల్లవరం: మండలంలో బుధవారం కూడా ఎడతెరపి లేకుండా వర్షం పడింది. పలు గ్రామాల్లో వందలాది ఎకరాల వరి పొలాలు ముంపు బారిన పడ్డాయి. రికార్డు స్థాయిలో వర్షం పడడంతో పల్లపు ప్రాంతాలు జలమయం అయ్యాయి. భారీ వర్షానికి వరి నాట్లకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. పొలాల్లో ముంపునీరు తిష్ట వేయడంతో నాట్లు వేసే అవకాశం లేక రైతులు ఇబ్బంది పడ్డారు. అలాగే నాట్లు వేసిన వరి క్షేత్రాల్లో నీరు చేరింది. వేలాది ఎకరాల్లో ఇదే పరిస్థితి. దీంతో నాట్లు దెబ్బతినే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. దీనికితోడు ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న నీరు కాలువ నుంచి గట్లపైగా పొంగి పొర్లేట్టు ప్రవహిస్తుంది. అధికారులు స్పందించి ముంపు నివారణకు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.



కోడూరుపాడు వద్ద ముంపు నీటిలో వరి నాట్లు

యథేచ్ఛగా మద్యం, మాంసం విక్రయాలు

కాట్రేనికోన: స్వాతంత్ర్యం దినోత్సవం సందర్భంగా మద్యం, మాంసం విక్రయించడం నేరం. మండలంలో మద్యం దుకాణాలు మూసివేసినా బెల్టు షాపుల ద్వారా యథేచ్ఛగా మద్యం విక్రయాలు జరిగాయి. చెయ్యేరు, లక్ష్మీవాడ, కాట్రేనికోన, కందికుప్ప, దొంతికుర్రు, పల్లంకుర్రు తదితర ప్రాంతాల్లోని దుకాణాల్లో మాంసం అమ్మారు. రెస్టారెంట్లు, బిర్యానీ పాయింట్లు, భోజన హోటళ్లలో మాంసాహార వంటలు చేశారు. అధికారులు ప్రేక్షక పాత్ర వహించారు.







సేవలు గుర్తించి.. పురస్కారం అందించి..

అమలాపురం టౌన్: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా పలు ప్రభుత్వ శాఖల అధికారులకు ఉత్తమ సేవా పురస్కారాలు లభించాయి. అమలాపురంలోని బాలయోగి స్టేడియంలో శుక్రవారం జరిగిన స్వాతంత్ర్య దిన వేడుకల వేదికపై మంత్రి వాసంశెట్టి సుభాష్, కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్, జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు చేతుల మీదుగా ఆ అధికారులు పురస్కారాలు అందుకున్నారు. జిల్లా పంచాయతీరాజ్ డీఈఈ అన్యం రాంబాబు, అమలాపురం మున్సిపల్ రెవెన్యూ అధికారి (ఆర్వో) భూపతి శ్రీలక్ష్మి, మహాత్మా గాంధీ మున్సిపల్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె.ఘన సత్యనారాయణ, కల్వకొలను వీధి వార్డు సచివాలయ ఎన్విరాల్‌మెంట్ సెక్రటరీ బండి వీరన్న, పట్టణ సీఐ పి.వీరబాబు ఉత్తమ సేవా పురస్కారాలు అందుకున్నారు.

ఉత్తమ సేవలకు..

కాట్రేనికోన: నడవపల్లి పంచాయతీ తూర్పుపేటకు చెందిన గిడ్డి శ్రీనివాసరావు అనకాపల్లి జిల్లా పాయకరావుపేట ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐగా విధులు నిర్వహిస్తున్నారు. స్వాతంత్ర్య దిన వేడుకల సందర్భంగా అక్కడ శ్రీనివాసరావు 8వ సారి ఉత్తమ సేవా పురస్కారం అందుకున్నారు.

తాళ్లరేవు: స్థానిక తహసీల్దార్ పితాని త్రినాథరావు కాకినాడలో జరిగిన వేడుకల్లో ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కల్యాణ్ చేతుల మీదుగా ఉత్తమ పురస్కారం అందుకున్నారు. 40 ఏళ్ల సర్వీస్‌లో 27వ పురస్కారాన్ని అందుకున్న త్రినాథరావుకు పలువురు అభినందనలు తెలిపారు. ఆదేవిధంగా మండల ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ డీఎస్‌వీఎస్‌సీ సుకీర్తి ఉత్తమ సేవా పురస్కారాన్ని అందుకున్నారు.

యానాం: రాజీవ్ గాంధీ విశిష్ట పోలీస్ సేవా పతకాన్ని యానాం పట్టణ ట్రాఫిక్ ఎస్సై శేరు నూకరాజు పుదుచ్చేరి సీఎం రంగసామి నుంచి స్వీకరించారు. పోలీసు శాఖలో కానిస్టేబుల్, ఎస్సై తదితర హోదాల్లో 37 ఏళ్లపాటు సేవలందించిన నూకరాజు పోలీసు పతకం అందుకోవడంపట్ల పలువురు అభినందనలు తెలిపారు.

పురస్కారాలు ప్రదానం

అమలాపురం రూరల్: స్వాతంత్ర్య దిన వేడుకల్లో డీఎల్‌పీఓ బొజ్జిరాజు, కార్యదర్శులు రుద్రరాజు సూరపరాజు, ఎస్.దుర్గాశ్రీనివాస్, రెడ్డి శిరీష, అమలాపురం ఎంఎస్ఓ భారతిలు మంత్రి వాసంశెట్టి సుభాష్, కలెక్టర్ మహేష్ కుమార్ చేతుల మీదుగా ఉత్తమ సేవా పురస్కారాలను అందుకున్నారు.



మంత్రి సుభాష్ నుంచి ఉత్తమ సేవా పురస్కారం అందుకుంటున్న పంచాయతీరాజ్ డీఈఈ రాంబాబు, హెచ్‌ఎం ఘన సత్యనారాయణ, వార్డు సచివాలయ ఎన్విరాల్‌మెంట్ సెక్రటరీ వీరన్న, మున్సిపల్ రెవెన్యూ అధికారి శ్రీలక్ష్మి, సీఐ వీరబాబు, ఎంఎస్ఓ భారతి



ఉత్తమ సేవా పురస్కారం అందుకుంటున్న ఎక్సైజ్ సీఐ గిడ్డి శ్రీనివాసరావు



ఉప ముఖ్యమంత్రి నుంచి పురస్కారం అందుకుంటున్న తహసీల్దార్ త్రినాథరావు



పుదుచ్చేరి సీఎం రంగసామి నుంచి సేవా పతకం స్వీకరిస్తున్న నూకరాజు



పురస్కారాలు అందుకున్న డీఎల్‌పీఓ బొజ్జిరాజు, కార్యదర్శులు సూరపరాజు, దుర్గా శ్రీనివాస్, రెడ్డి శిరీషను అభినందిస్తున్న డీపీఓ శాంతలక్ష్మి